క్లుప్తంగా

రామసత్యనారాయణ మృతికి సంతాపం



రామసత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు

అల్లవరం: ఓడలరేవు జెడ్పీ క్లస్టర్ సీఆర్‌ఎంటీగా విధులు నిర్వర్తిస్తున్న కాండ్రేగుల రామసత్యనారాయణ ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందారు. స్థానిక మండల రిసోర్సు కార్యాలయంలో రామసత్యనారాయణ చిత్రపటానికి ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలియజేశారు. రామసత్యనారాయణ మృతి విద్యాశాఖకు తీరని లోటని ఎంఈఓ కిరణ్‌బాబు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీటీలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీకి చెందిన బ్రాహ్మణ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం స్థానిక భూపయ్య అగ్రహారంలోని మంథా రాంబాబు స్థల ప్రాంగణంలో శుక్రవారం రాత్రి 7 గంటలకు జరగనుందని ఆహ్వాన కమిటీ ప్రతినిధులు మాచిరాజు రవికుమార్, మంథా శివ వెల్లడించారు. భూపయ్య అగ్రహారంలో గురువారం ఆహ్వాన కమిటీ బ్రాహ్మణ నాయకులు సమావేశమై ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసే అంశంపై చర్చించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులు మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బ్రాహ్మణ నాయకులు పాలుగమ్మి వాసు, కాదంబర శాస్త్రి, పుత్రేవు చందు, గోరువంతుల సీతారామ్, విస్సాప్రగడ చిన్న, ఉపద్రష్ట విక్రమ్, దిట్టకవి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారాలు



సత్కారం అందుకున్న విద్యార్థులతో ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: మండలంలో పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం రాత్రి స్థానిక మూడు తూముల సెంటర్‌లో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు వారిని సన్మానించారు. కవి, రచయిత కత్తిమండ ప్రతాప్, యువ నాయకుడు కుసుమ చింటు సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విద్యార్థులు చొప్పల సోను, కుసుమ క్రెసెంట్, కుసుమ జోయ్, గెద్దం హన్సిని ఏంజెల్, కుసుమ షిప్రావలి సత్కారాలు అందుకున్నారు.

విద్యా కానుకను సక్రమంగా అందించాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యా కానుకను విద్యార్థులకు సక్రమంగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదన్‌రావు, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బి.వీరవెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం ఎంఈఓ ఎస్వీ సుబ్బరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాకానుక అమలు తీరును, రికార్డుల నిర్వహణను స్థానిక సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఆర్పీలకు వివరించారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: పి.గన్నవరం సీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 42 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించారు. వీరిలో ముగ్గురిని క్రిటికల్ కేసులుగా గుర్తించి అమలాపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. వై.కొత్తపల్లి వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు, వారి సహాయకులకు పౌష్టికాహారం అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, వైద్యులు ఎల్.శిరీష, రాఘవేంద్రరావు, గీతా గాయత్రి, చందన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి తీర్థం

పి.గన్నవరం: ఎల్.గన్నవరం గ్రామంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

ఫ్యాను జోరు.. సైకిల్ బేజారు

- వైఎస్సార్ సీపీలో చేరికలతో సమరోత్సాహంతో విశ్వరూప్
- కీలక నేతలంతా పార్టీని వీడడంతో నైరాశ్యంలో ఆనందరావు
- ప్రచారంలోనూ వెనకబడి చతికిలబడిన టీడీపీ



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం టౌన్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఫ్యాను జోరు మరింత పెరిగితే ఎన్నికలకు ముందే సైకిల్ బేజారైంది. ఒకవైపు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ పార్టీలో వరుస చేరికలతో విజయోత్సాహంతో ప్రచారం చేస్తుంటే, మరోవైపు టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు మాత్రం సొంత పార్టీతో పాటు పొత్తు పెట్టుకున్న జనసేన నుంచి కీలక నేతలంతా వీడడంతో నైరాశ్యంలో మునిగిపోయారు. ఆఖరికి సొంతూరిలో సైతం ఆనందరావుకు బలం లేదన్న విషయం తేలిపోవడంతో ఓటమి తప్పదని ఇప్పటికే టీడీపీ కార్యకర్తలకు సైతం తేటతెల్లమైపోయింది. ఈ నేపథ్యంలో టీడీపీలో మిగిలిన కొద్దిమంది నేతలు ఇప్పుడేం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

విశ్వరూప్ వ్యూహాత్మక అడుగులు

ఇప్పటికే మూడు సార్లు ఎమ్మెల్యేగా, దాదాపు పదేళ్లు మంత్రిగా పనిచేసిన పినిపే విశ్వరూప్ తన విజయం ఖాయమని అర్థమవుతున్నా వ్యూహాత్మకంగా అడుగులేస్తూ ప్రచారంలో దూసుకెళుతున్నారు. విశ్వరూప్‌కు ఉన్న ఆదరణ కారణంగా అమలాపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి ఇతర పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి, నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా తాను చేసిన అభివృద్ధిని సగర్వంగా చెప్పుకుని మంత్రి పినిపే విశ్వరూప్ ఓట్లు అడుగుతున్నారు. తాగునీరు, రోడ్లు వంటి కనీస సదుపాయాల కల్పన గురించి ప్రాంతాల వారీగా, పనుల వారీగా ఓటర్లకు వివరిస్తున్నారు. విశ్వరూప్‌కు తోడుగా ఆయన సతీమణి బేబీ మీనాక్షి, కుమారులు కృష్ణారెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌లు సైతం నియోజకవర్గంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ప్రచారంలో మంత్రి విశ్వరూప్‌కు మహిళలు ఎదురేగి హారతులిచ్చి ఘన స్వాగతం పలుకుతున్నారు. అభిమానులు పూలజల్లులు, గజమాలలతో సత్కరిస్తున్నారు. ప్రచార రథంపై ఆయా గ్రామాల ప్రధాన వీధుల్లో ఊరేగి తర్వాత ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. విశ్వరూప్ ఏ ఊరు వెళితే అక్కడి ప్రజలు, పార్టీ శ్రేణులు దగ్గరుండి ప్రచారం చేయిస్తున్నారు.

నోటి దురుసుతనం తెచ్చిన చేటు

అసలు టికెట్ వస్తుందో రాదో తెలియని పరిస్థితుల్లో ఆఖరి నిమిషంలో అభ్యర్థిగా ఎంపికైన అయితాబత్తుల ఆనందరావు ఆది నుంచి ప్రచారంలో వెనకబడిపోయారు. మరోవైపు తన నోటి దురుసుతనం కారణంగా టీడీపీ, జనసేనల నుంచి కీలక నేతలంతా బయటకు వెళ్లిపోవడంతో ఎన్నికల ముందు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పార్టీ పెట్టినప్పటి నుంచి టీడీపీలో ఉన్న నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు అడపా కృష్ణ ప్రసాద్, టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు లింగోలు వెంకన్న(పెదకాపు) పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అంతేకాదు ఆనందరావు తమకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా హేళన చేసి మాట్లాడుతుండడం వల్లే పార్టీని వీడుతున్నామని వెల్లడించారు. మాజీ హోంమంత్రి చినరాజప్ప సోదరుడు నిమ్మకాయల జగ్గయ్యనాయుడైతే ఏకంగా టీడీపీలో ముఖ్యనేతల పోరు పడలేక రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించారు. జనసేనలోనూ ఆనందరావు బాధితులున్నారు. టీడీపీ నాయకులు తమకు గౌరవం ఇవ్వడం లేదంటూ జనసేన పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌చార్జులు డీఎంఆర్ శేఖర్, శెట్టిబత్తుల రాజబాబులు తమ అనుయాయులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరిపోయారు. మరోవైపు టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ పరమట శ్యామ్ టీడీపీ రెబల్ అభ్యర్థి(స్వతంత్ర)గా పోటీకి దిగడం సైతం ఆనందరావుకు తలబొప్పి కట్టించేస్తుంది. తాను ఎమ్మెల్యేగా ఉండగా ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ఆఖరికి సొంతూరైన ఎస్.యానం ప్రజలు సైతం విశ్వరూప్‌కు బ్రహ్మరథం పడుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీనివల్లే నియోజకవర్గంలో ఆనందరావు ప్రచారం సైతం మొక్కుబడిగా మారిపోయింది. కేవలం పార్టీ నుంచి వచ్చిన ఫండింగ్ మిగుల్చుకోవాలన్న ఆరాటమే తప్ప ఓటమి ఖాయమన్న నిర్ణయానికి ఇప్పటికే ఆనందరావు వచ్చేశారని టీడీపీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారు.

వృక్షాల నరికివేతపై ఫిర్యాదు



పరంపేట ఏటిగట్టు వద్ద ఉన్న వృక్షాలను ప్రొక్లెయినర్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం

యానాం: నియోజకవర్గ పరిధిలోని కురసాంపేట చర్చి సెంటర్ నుంచి దరియాలతిప్ప, గిరియాంపేట వరకూ ఏటిగట్టు వెంబడి ఇరువైపులా ఉన్న వృక్షాలను నరికేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఏఓ మునిస్వామికి విదుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ శాఖ కార్యదర్శి మెల్లం శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. 1996 తుఫానుకు ముందు యానాం వ్యవసాయశాఖ ఏటిగట్టు పటిష్టత కోసం మొక్కల పెంపకం చేపట్టిందన్నారు. అవి పెద్ద వృక్షాలుగా తయారై వరదల సమయంలో ఏటిగట్టు కుంగిపోకుండా రక్షణగా ఉంటున్నాయన్నారు. అయితే పరంపేట మహాలక్ష్మమ్మ గుడి దాటిన తర్వాత కొంతమంది ప్రొక్లెయినర్ సాయంతో వృక్షాలను నరికేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సబ్బతి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



ముమ్మిడివరంలో ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



ముమ్మిడివరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- నగర పంచాయతీలో ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు మహిళలు అడుగడుగునా మంగళ హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ చంద్రబాబు 2014లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయని విషయాన్ని మరిచిపోవొద్దన్నారు. బాబు, ఎల్లో మీడియా ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. పేదల పక్షాన నిలబడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాదరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, శెట్టిబత్తుల రాజబాబు, పెన్మత్స చిట్టిరాజు, హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాలమునికుమారి, కోలా బాబ్జి, వైస్ చైర్మన్లు రెడ్డి హేమ సుందరి, వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు సరిపెల్ల రామకృష్ణంరాజు, బొంతు సత్యశ్రీనివాస్, గణేశుల బ్రహ్మానందం, రెడ్డి శివన్నారాయణ, రాజులపూడి కృష్ణ, కోటుం జయలక్ష్మి, టి.శాంతిసుధ తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రానికి ఇటుక బట్టీ కార్మికుల తరలింపు



చుకోడియా కుటుంబ సభ్యులతో ఎస్సై శ్రీను నాయక్

ఆలమూరు/అమలాపురం టౌన్: చొప్పెల్లలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒడిశా కార్మికులను సంబంధిత బట్టీ యజమాని వేధింపులకు గురి చేస్తున్నాడంటూ సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంపై జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ స్పందించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్‌కే ఖాదర్‌బాషా నేతృత్వంలో కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్‌కు విచారణ బాధ్యతను గురువారం అప్పగించారు. దీంతో ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ తన సిబ్బందితో స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న ఇటుక బట్టీ వద్దకు వెళ్లారు. కార్మికుడు జగన్నాథ చుకోడియాను పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బట్టీ యజమాని వానపల్లి మణికంఠ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటుక బట్టీలో తనతో పాటు, భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు పని చేస్తున్నారని వివరించారు. తన కుటుంబ సభ్యులను వెంటనే సొంత రాష్ట్రానికి పంపించి, తమను ఆదుకోవాలని, యజమాని చెర నుంచి కాపాడాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ జరిపిన ఎస్సై శ్రీనునాయక్ అక్కడి పరిస్థితిని అవగాహన చేసుకున్నారు. బట్టీ యజమాని మణికంఠను పిలిపించి, కార్మికుడు చుకోడియా కుటుంబానికి రవాణా ఖర్చులు ఇప్పించారు. పోలీసు సిబ్బంది సహకారంతో కార్మికులను రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి, రైలు ఎక్కించి ఒడిశాకు పంపించారు. ఎస్సై శ్రీను నాయక్ బృందాన్ని ఎస్పీ శ్రీధర్ అభినందించారు. ఇలాఉండగా కార్మికులు పనిచేసేందుకు అడ్వాన్స్‌గా రూ.70 వేలు అందించానని, వారు పనిచేయకుంటే ఎలా అంటూ బట్టీ యజమాని మణికంఠ పోలీసుల వద్ద వాపోయినట్టు తెలిసింది.

పేదల సంక్షేమానికి పెద్దపీట

వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం



చల్లపల్లిలో ఫ్యానుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని, ఆయనను మళ్లీ సీఎంగా చేసుకోవాలని జిల్లా పాస్టర్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు కుంచే రమణారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందించారన్నారు. ప్రతి ఓటరు గత టీడీపీ పాలన, ప్రస్తుత వైసీపీ పాలనను పోల్చి చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

ముమ్మిడివరం: ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ పేర్కొన్నారు. ఆయన గురువారం నగర పంచాయతీ 10, 11, 12 వార్డులతో పాటు మండలంలోని అనాతవరం, సీహెచ్ గున్నేపల్లి, చినకొత్తలంక, గేదెల్లంక, గాడిలంక, కర్రివానిరేవు, అన్నంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమాల్లో కోలా బాబ్జీ, కాశి భాగ్యలక్ష్మి, కాశి జగపతిరావు, చింతా నాగమునీంద్రరావు, ఇందుకూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌ను గెలిపించాలి

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను గెలిపించాలని వైఎస్సార్ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు అన్నారు. గురువారం బండారులంకలో కాలెపు శ్రీనివాసరావు, నల్లమిల్లిలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ముఖ్యమంత్రి జగన్‌ను, మంత్రి విశ్వరూప్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిశెట్టి శ్రీను, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, దంగేటి రుద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

తాళ్లరేవు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు సీఎం జగన్‌తోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కాపవరపు శ్రీదేవి అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రమైన తాళ్లరేవు, చొల్లంగి పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను, ఎంపీగా రాపాక వరప్రసాద్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయీ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



నగర పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న పితాని బాలకృష్ణ



బండారులంకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాలెపు శ్రీనివాసరావు



చొల్లంగి పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాపవరపు శ్రీదేవి

జలకాలాడేద్దాం.. ఈత నేర్చుకుందాం..



యానాంలో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు

- స్విమ్మింగ్‌పూల్ బాట పడుతున్న చిన్నారులు
- సేద తీరుతూనే లైఫ్ స్కిల్‌లో శిక్షణ

యానాం: వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారుల తల్లిదండ్రులు సమ్మర్ క్యాంపులపై ఫోకస్ పెడుతున్నారు. యానాంలో స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం ఆవరణలో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌కు చిన్నారులు పోటెత్తుతున్నారు. ఒకవైపు వేసవి ఎండ, వడగాల్పుల నుంచి సేదదీరుతూ మరోవైపు లైఫ్‌స్కిల్‌గా తమను తాను రక్షించుకునేందుకు ఉపకరించే ఈత నేర్చుకుంటున్నారు. యానాంతో పాటు పరిసర ప్రాంతాల చిన్నారులు సైతం శిక్షణ పొందుతున్నారు. యానాం చిన్నారులకైతే ఉచితంగానూ, పరిసర ప్రాంతాలకు చెందిన వారికి కనీస ఫీజు తీసుకుని స్విమ్మింగ్ నేర్పుతున్నారు.

ఒప్పందం ప్రకారం స్విమ్మింగ్‌పూల్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) అకాడమీ నిర్వహించాల్సి ఉండగా వారు నిర్వహణ చేయకపోవడంతో డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి చేర్చారు. యానాం ఓల్డేజ్‌హోమ్ సైతం దీని నిర్వహణకు సహకారం అందిస్తుంది. వేసవి సెలవులు ఇవ్వడంతో రోజుకు సుమారు వంద మంది చిన్నారులు స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్నారని పీఈటీ నక్కల సుబ్బన్న తెలిపారు. ప్రమాదాలు జరగకుండా కొత్తగా ఈత నేర్చుకుంటున్నవారికి ప్రాథమిక అంశాలు చెబుతున్నామన్నారు. స్విమ్మింగ్ వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పలువురు చిన్నారుల తల్లిదండ్రులంటున్నారు. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరగడంతో పాటు లైఫ్ స్కిల్‌గానూ ఈత ఉపయోగపడుతుందంటున్నారు.

జగన్‌తోనే బీసీలకు రాజ్యాధికారం

ఆత్మీయ సమావేశంలో బీసీ నేతలు



బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాపాక వరప్రసాద్

అయినవిల్లి: బీసీలకు రాజ్యాధికారం ఇచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన రుణం బీసీలు ఓట్లు వేసి తీర్చుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు అన్నారు. తొత్తరమూడిలో గురువారం బీసీల ఆత్మీయ సమావేశం అంకం వీర్రాజు అధ్యతన జరిగింది. ముఖ్య అతిథులుగా అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను టీడీపీ అధినేత చంద్రబాబు అణగదొక్కారని మండిపడ్డారు. ఏనాడూ బీసీల ఉన్నతిని పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు అత్యంత ప్రాధాన్యం కల్పించారన్నారు. రాజ్యాధికారం దిశగా బీసీలను ఏకతాటిపై నడిపిస్తున్నారన్నారు. ఇప్పుడు చంద్రబాబు బీసీల ఓట్ల కోసం మొసలి కన్నీరు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వాసంశెట్టి తాతాజీ, కుడుపూడి రామకృష్ణ, మట్టపర్తి వెంకటరమణ, మేడిశెట్టి శ్రీను, పోతబత్తుల అంజనేయులు, సత్తిబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్ సస్పెన్షన్

మలికిపురం: చింతలమోరి గ్రామంలో విద్యుత్ లైన్‌మన్ సీహెచ్.వెంకట్రావును ఉన్నతాధికారులు ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్టు ఏపీఈపీడీసీఎల్ రాజోలు ఏడీఈ సీహెచ్ శ్రీనివాసరావు, ఏఈ మద్దూరి సతీష్ బుధవారం ధ్రువీకరించారు. గ్రామంలో కొల్లు డాల్‌రాజు అనే వినియోగదారుడు తన ఇంటి విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని లైన్‌మన్ వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. అతని వద్ద రూ.3 వేలు తీసుకున్న వెంకట్రావు.. బిల్లు ఎక్కువ రాకుండా విద్యుత్ మీటరును సీల్ చేశాడు. అయినా మరుసటి నెల బిల్లు అధికంగా రావడంతో డాల్ రాజు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనితో పాటు గ్రామంలో రొయ్యల చెరువుకు అక్రమ విద్యుత్ ఇస్తున్నాడని కూడా లైన్‌మన్ వెంకట్రావుపై సర్పంచ్ రాపాక రమేష్‌బాబు ఫిర్యాదు ఇచ్చారు. ఆయా ఫిర్యాదులపై విచారణ చేసిన ఉన్నతాధికారులు.. లైన్‌మన్ వెంకట్రావుపై వేటు వేశారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం తగదు



ఏజీపీ యర్రంశెట్టి అప్పలనాయుడు

రాజోలు: కొన్ని రాజకీయ పార్టీల వారు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేయడం సరికాదని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యర్రంశెట్టి అయ్యప్పనాయుడు అన్నారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ సంపూర్ణ భూ హక్కు చట్టంపై లేనిపోని అపోహలు సృష్టించి, ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. భూమికి సంపూర్ణ హక్కులతో పాటు, రక్షణ కల్పించి భూ కుంభకోణాలు, అక్రమాలను నిరోధించడమే ఈ చట్టం ముఖ్యోద్దేశమన్నారు. 2019లోనే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ముసాయిదా పంపించిందన్నారు. నీతి అయోగ్, ప్లానింగ్ కమిషన్ సిఫార్సుల మేరకే చట్టం చేయబడుతుందని, దేశవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే చేయాల్సి ఉందన్నారు. సర్వే పూర్తయిన తర్వాతే న్యాయ నిపుణులు, మేధావులు, రెవెన్యూ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని, అన్ని రాష్ట్రాల్లో చట్టాన్ని అమలు చేస్తారన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు వారి స్వార్థప్రయోజనాల కోసం చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు.